APTEL/2009/29308

# స్నేహిత ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

13-07-2026
సోమవారం
హైదరాబాద్
సంపుటి: 17 । సంచిక: 259
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.expresstelugudaily.com



## కాంగ్రెస్ చేతకానితనాన్ని ఎన్డీఎస్ఏపై నెట్టడం సిగ్గుచేటు

2




# పేరు మార్చమంటే అన్యాయం

## వెయ్యి అభ్యంతరాలు వచ్చాయని పేర్కొన్నారు

**105 నియోజకవర్గాల్లో పార్టీ జెండా ఎగురవేశాం..**

**పార్టీ నిర్మాణ పరమైన ఇతర కార్యక్రమాలు చేపట్టాం**

- ఆ అభ్యంతరాల్లో ఒక్కటి కూడా మాకు పంపలేదు
- "తెలంగాణ రక్షణ సేన" అనే పేరుతో దేశంలో మరే ఇతర రాజకీయ పార్టీ కూడా నమోదు కాలేదు
- ఇది ఏ గుర్తింపు పొందిన లేదా నమోదైన రాజకీయ పార్టీ పేరును పోలి లేదు
- అభ్యంతరాలకు సరైన సమాధానం ఇవ్వడానికి అనుమతి ఇవ్వాలి
- చట్టప్రకారం నిష్పాక్షికమైన, హేతుబద్ధమైన పూర్తి కారణాలతో స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలి
- "తెలంగాణ రక్షణ సేన" పార్టీ గుర్తింపు కోసం మా దరఖాస్తును పరిశీలించి, ఆమోదించాలి
- కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసిన ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ రక్షణ సేనకు గుర్తింపు ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆ పార్టీ కోరింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ రక్షణ సేన ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ లేఖ రాశారు. పార్టీ రిజిస్ట్రేషన్‌ను వ్యతిరేకిస్తూ వచ్చిన వెయ్యి అభ్యంతరాలను తమకు పంపాలని కోరారు. అభ్యంతరాల కాపీలు ఇవ్వకుండా సమాధానం ఎలా చెప్పగలమని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తొలుత కేటాయించిన పేరుతోనే 105 నియోజకవర్గాల్లో పార్టీ జెండాలు ఎగురవేశామని.. ఇప్పుడు పేరు మార్చమంటే అన్యాయమన్నారు. తెలంగాణలో ఒకే రకమైన పేర్లతో పలు పార్టీలకు గుర్తింపు ఇచ్చారని.. రక్షణ సేనపైనే అభ్యంతరాలు ఎందుకని ప్రశ్నించారు. అభ్యంతరాలను పరిశీలించి, సమాధానం ఇచ్చేందుకు తగిన సమయం ఇచ్చాకే వ్యక్తిగత విచారణకు పిలవాలని విజ్ఞప్తి




చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951 సెక్షన్ 29ఎ కింద తమ పార్టీ దరఖాస్తును పరిశీలించి ఆమోదించాలని కోరారు.
తెలంగాణ రక్షణ సేన పార్టీకి..

మిగతా 2లో...

### హైదరాబాద్ ప్రజలకు

# ట్యాంకర్లే దిక్కు!

## భూగర్భ జలాలు అట్టడుగుకు

- వర్షా భావంతో నగరంలో తీవ్రమవుతున్న నీటి ఎద్దడి
- రోజూ జలమండలి నుంచే 18వేల ట్యాంకర్ల సరఫరా
- పెరుగుతున్న నీటి బిల్లుల భారం..
- భారీ అపార్ట్‌మెంట్లలో విచ్చలవిడిగా బోర్లు..పట్టించుకోని అధికారులు
- దండుకుంటున్న ప్రైవేట్ ట్యాంకర్ వ్యాపారులు



2


### డబుల్ రోడ్ల నిర్మాణానికి

## ప్రభుత్వం ప్రాధాన్యం

- రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేశాం
- రాష్ట్రంలో రూ.20 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం చేపట్టాం
- గందమల్ల ప్రాజెక్టుతో ఆలేరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తాం
- యాదగిరి కొండ కింద అభివృద్ధిని గత ప్రభుత్వం పట్టించుకోలేదు
- కొత్తగా ఏర్పడిన మోటకొండూరు మండలాన్ని కూడా నిర్లక్ష్యం చేశారు
- ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలి
- ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆలేరు ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారు.
- ఐలయ్యకు మంత్రి పదవి వచ్చేలా కృషి చేస్తా : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



2



### స్కాంల ప్రభుత్వం పోయి స్కీముల

## ప్రభుత్వం వచ్చుడు ఖాయం

- సర్ ప్రక్రియపై పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి
- జీహెచ్ఎంసి ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే నాయకులు సర్‌ను సీరియస్‌గా తీసుకోవాలి
- బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన అనేక సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టింది
- సిగాచి ప్రమాదంలో 54 మంది మృతి చెందినా బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం చేయలేదు : మాజీ మంత్రి హరీష్ రావు

2



### మా రక్తం తీసుకొని

## మీ రక్త దాహం తీర్చుకోండి

- రైతుల కోసం ఎంత రక్తమైనా ధారపోయడానికి సిద్ధంగా వున్నం
- ఎండుతున్న పొలాల జల దాహం తీర్చండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు

2

విలేకరులు కావలెను

స్నేహిత ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
expresstelugudaily.com

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మండల రిపోర్టర్లు, యాడ్స్ ఏజెంట్స్ వెంటనే కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు..

Contacts
తెలంగాణ
95500 21491

# పేరు మార్చుమంటే అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

గుర్తింపునివ్వాలని ఆ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. ఈనెల 7వ తేదీన ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు తాజాగా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు కవిత రిప్లయ్ ఇచ్చారు. తెలంగాణ రక్షణ సేన ప్రధాన కార్యదర్శి హోదాలో అనిల్ కుమార్ ఆదివారం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌తో ఎన్నికల కమిషనర్‌లకు లేఖ రాశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరును తమకు కేటాయిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 28న లేఖ ద్వారా సమాచారం ఇచ్చిందని తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్ తమకు తెలంగాణ రక్షణ సేన పార్టీ తమకు కేటాయించడంతో తెలంగాణ వ్యాప్తంగా 105 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ జెండాలు ఆవిష్కరించుకోవడంతో పాటు పార్టీ నిర్మాణ పరమైన ఇతర కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ జూన్ 23న తమకు లేఖ రాస్తూ తెలంగాణ రక్షణ సేన పార్టీ రిజిస్ట్రేషన్‌పై సుమారు వెయ్యి అభ్యంతరాలు వచ్చాయని పేర్కొన్నారని వివరించారు. కానీ ఇంత వరకు ఆ అభ్యంతరాల్లో ఒక్కటి కూడా తమకు పంపలేదని తెలిపారు. అభ్యంతరాలు ఎవరు తెలిపారు?, ఆయా అభ్యంతరాల్లో ఏమి పేర్కొన్నారు?, అనే వివరాలు కూడా ఇవ్వలేదన్నారు. అసలు అభ్యంతరాలనే తమకు పంపకుంటే తాము సమాధానం ఎలా చెప్పగలమని అన్నారు.

**మాకు తీవ్ర నష్టం, అన్యాయం చేసినట్లే..**

తెలంగాణ రాష్ట్ర జనాభా మూడున్నర కోట్లు అని.. వెయ్యి అభ్యంతరాలు వచ్చాయనే సంఖ్యను చూపిస్తూ ఈసీ నిర్ణయం సరికాదన్నారు. అసలు అభ్యంతరాల వెనుక లీగల్ మెరిట్ ఏంటి అనేది పరిశీలించాలి? ఎవరైనా కావాలనే గ్రూపులుగా ఏర్పడి, ప్లాన్ ప్రకారం ఇదంతా చేయించారా? అనేది తమకు అబ్జెక్షన్ కాపీలు ఇస్తేనే తెలుస్తుంది. ఈసీ ఆమోదించిన పేరును నమ్ముకొని సంస్థాగతంగా పార్టీ బలోపేతం చేసుకున్నామని.. ఇప్పుడు ఆ పేరును మార్చుకోవాలని అంటే అది తమకు తీవ్ర నష్టం, అన్యాయం చేసినట్లు అవుతుందని తెలిపారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశించినట్టుగా తాము ఈసీ ఎదుట వ్యక్తిగత విచారణ హాజరవాడానికి ముందే తమ పార్టీపై వచ్చిన అన్ని అభ్యంతరాల కాపీలను ఇవ్వాలని కోరారు. అప్పుడు మాత్రమే తాము సరైన సమాధానం చెప్పుకునే అవకాశం కలుగుతుందన్నారు. ప్రతిపాదిత "తెలంగాణ రక్షణ సేన" అనే పేరును మేము పూర్తి సదుద్దేశంతో స్వతంత్రంగా ఆలోచించి పెట్టిన పేరు అని వివరించారు. "తెలంగాణ రక్షణ సేన" అనే పేరుతో దేశంలో మరే ఇతర రాజకీయ పార్టీ కూడా నమోదు కాలేదని.. ఇది ఏ గుర్తింపు పొందిన లేదా నమోదైన రాజకీయ పార్టీ పేరును పోలి లేదని అన్నారు. రెండు పార్టీల పేర్ల మధ్య పోలికలను నిర్ధారించుకునేప్పుడు రాజకీయ పార్టీ యొక్క పూర్తి పేరును ఒకే సమగ్ర రూపంగా భావించాలని.. కానీ అందులోని విడి పదాలను ముక్కలు చేసి లేదా విడదీసి చూడకూడదన్నారు.

**మా పార్టీ పేరుకు ఏ పార్టీతోనూ పోలిక లేదు..**

ఎన్నికల కమిషన్ తమకు పంపిన అభ్యంతరాల్లోని “తెలంగాణ రక్షణ సమితి (డెమోక్రాటిక్) (2024)”, “తెలంగాణ రాజ్య సమితి” (2023) అనేవి వేర్వేరు పేర్లు.. విభిన్న ఉచ్చారణ, నిర్మాణం, గుర్తింపు, నాయకత్వం, సంస్థాగత శైలి తో పాటు ప్రజల్లో వేర్వేరు గుర్తింపు కలిగిన రాజకీయ పేర్లు అని వివరించారు. ఆ పేర్లతో "తెలంగాణ రక్షణ సేన"ను దాని సమగ్ర రూపంలో పరిశీలించినప్పుడు, అది పూర్తి భిన్నంగా, స్పష్టంగా గుర్తించదగిన రాజకీయ పార్టీగా తెలుస్తోందన్నారు.. ప్రస్తుతం ఉనికిలో ఉన్న ఏ గుర్తింపు పొందిన లేదా నమోదైన రాజకీయ పార్టీతోనూ తమ పార్టీ పేరుకు పోలిక లేదన్నారు. గతంలో కూడా కేవలం ఒకే రకమైన భౌగోళిక వర్ణనాత్మక, సిద్ధాంతపరమైన పదాలు ఉన్నాయనే కారణంతో పార్టీ రిజిస్ట్రేషన్ నిరాకరించిన దాఖలాలు కూడా లేవని వివరించారు. ఒకే విధమైన పదాలతో సమాంతరంగా వేర్వేరు రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలు దేశంలో వందల్లో ఉన్నాయని తెలిపారు. ఆమ్ ఆద్మీ, అఖండ్ భారత్, మక్కల్, ప్రజా సేవ, జన్ అధికార్, రాష్ట్రీయ జనతా, డెమొక్రాటిక్, సోషల్, రిపబ్లిక్ ఇండియా, శిరోమణి లాంటి పేర్లతో వందలాది పార్టీలు రిజిస్ట్రేషన్ పొంది ఉన్నాయన్న విషయం పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ గుర్తింపునిచ్చిన ఒకే విధమైన పేర్లు ఉన్న పార్టీల జాబితాను లేఖకు జత చేశారు. "తెలంగాణ రక్షణ సేన" పార్టీ పేరుపై వచ్చిన అన్ని అభ్యంతరాల కాపీలను, అలాగే తమకు వ్యతిరేకంగా ఉపయోగించాలనుకుంటున్న అన్ని ఆధారాలను తమకు అందజేయాలని కోరారు.అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సమాధానం ఇవ్వడానికి తమకు తగినంత సమయం ఇచ్చాకే.. వ్యక్తిగత విచారణకు పిలవాలని విజ్ఞప్తి చేశారు. ఆ వివరాల వెల్లడి తర్వాత తమ వాదనలను సమర్థవంతంగా వినిపించడానికి, అభ్యంతరాలకు సరైన సమాధానం ఇవ్వడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. కేవలం సాధారణ భౌగోళిక వర్ణనాత్మక ఉనికిని బట్టి, ఊహాజనిత సంక్షిప్త రూపాల ఆధారంగా వచ్చిన అభ్యంతరాలన్నింటినీ తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. చట్టప్రకారం నిష్పాక్షికమైన, హేతుబద్ధమైన పూర్తి కారణాలతో కూడిన స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 29A కింద ప్రతిపాదిత "తెలంగాణ రక్షణ సేన" పార్టీ గుర్తింపు కోసం తాము చేసుకున్న దరఖాస్తును పరిశీలించి, ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ చేతకానితనాన్ని ఎన్డీఎస్ఏపై నెట్టడం సిగ్గుచేటు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ‘తెలంగాణ ప్రజలకు రెండు పార్టీల నేతలు రక్తకన్నీరు సినిమా చూపిస్తున్నారు. కాంగ్రెస్ డైరెక్షన్..బీఆర్ఎస్ యాక్షన్ మూవీ రక్తకన్నీరు 2 ను తలపిస్తోంది. ‘రక్త కన్నీరు’ నాగభూషణంను మించి నటనలో జీవిస్తున్నారు’ అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ కాళేశ్వరాన్ని కూల్చి రూ.లక్ష కోట్ల ప్రజాధనాన్ని నీళ్ల పాల్జేసిందన్నారు. ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా చర్యలు తీసుకోకుండా కాంగ్రెస్ సర్కార్ కాళేశ్వరాన్ని కోమాలోకి నెట్టిందన్నారు. ఈ రెండు పార్టీల పాపాలకు తెలంగాణ రైతులే బలవుతున్నారని, కాంగ్రెస్ చేతకానితనాన్ని ఎన్డీఎస్ఏపై నెట్టడం సిగ్గుచేటన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడం ఇకనైనా మానుకోవాలని హితవుపలికారు. డ్యామ్ సేఫ్టీ యాక్ట్2021 ప్రకారం...బ్యారేజీల యజమాని తెలంగాణ ప్రభుత్వమేనని తెలిపారు. ఎన్డీఎస్ఏ, సీడబ్ల్యూసీ కమిటీలు సలహాలు మాత్రమే ఇస్తాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. బ్యారేజీ మరమ్మతు పనులు చేయాల్సింది.. బాధ్యత వహించాల్సింది కూడా రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ ఇప్పటికే 3 సార్లు నివేదిక ఇచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదు? పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని పదే పదే చెప్పినా ఎందుకు పెడచెవిన పెడుతున్నారు? అని బండి సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కార్ చేతగానితనాన్ని కేంద్రంపై నెట్టడం అలవాటుగా మారిందన్నారు. ‘కాళేశ్వరంలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, బాధ్యులను జైల్లో వేస్తామని గతంలో ప్రకటించింది కాంగ్రెస్సే. అధికారంలోకి వచ్చాక రూ.లక్ష కోట్ల అవినీతిపై విచారణ జరపకుండా రూ.9 వేల కోట్ల అవినీతిపై విచారణకే పరిమితమైంది నిజం కాదా? ఆ కేసులో సూత్రధారులను అరెస్ట్ చేసి జైల్లో వేయకుండా సీబీఐ దర్యాప్తు చేయాలంటూ కేంద్రంపై రుద్ది తప్పుకున్నది నిజం కాదా? కాళేశ్వరంపై విజిలెన్స్ నివేదిక ఇస్తే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అసలు విజిలెన్స్ నివేదికను బయట పెట్టే దమ్ముందా? బీఆర్ఎస్ పాపాలను రేవంత్ రెడ్డి మోయడం వెనుక మతలబు ఏమిటి? తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి.. అని నిలదీశారు. కాళేశ్వరం మరమ్మతుల విషయంలోనూ రెండున్నరేళ్లు జాప్యం చేసింది మీరు కదా? ప్రజల నుంచి ఒత్తిడి వస్తుంటే చర్చను దారి మళ్లించేందుకు ఎన్డీఎస్ఏ కు అప్పగిస్తామంటూ కేంద్రంపై నెట్టాలని చూస్తున్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతి, నిర్లక్ష్యం, కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల గోదావరి జలాలను తెలంగాణ ప్రజలు వినియోగించుకోలేని దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా రాజకీయ డ్రామాలు పక్కనపెట్టండి.. ఎన్డీఎస్ఏ సిఫార్సులను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయండి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణను వేగవంతం చేయండి లేనిపక్షంలో తెలంగాణ రైతుల ఆగ్రహానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ బలికాక తప్పదు’ అని కాళేశ్వరంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఫైర్ అయ్యారు.

## మా రక్తం తీసుకొని మీ రక్త దాహం తీర్చుకోండి



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** నీటి కొరత విషయంలో జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన సమాధానాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో సోషల్ మీడియా వేదికగా మండిపడ్డారు. అందులో “రైతులకు కావాల్సిన నీళ్లు అడిగితే నెత్తురు చల్లుతా అంటవా..రక్త పిశాచి.. ఇంకా తీరలేదా మీ రక్త దాహం అంటూ ప్రశ్నించారు. అలాగే 60 ఏండ్లు పీడించి తెలంగాణ నెత్తురు తాగారు కదా..సరిపోలేదా..? తెలంగాణ రక్తం రుచి మరిగిన తోడేలు కాంగ్రెస్ పార్టీకి ఇంకెంత రక్తం కావాలి?, తెలంగాణ పిల్లల్ని పిట్టల్ని కాల్చినట్టు కాల్చి పారేసిన ఎన్ కౌంటర్ల పేరుతో నెత్తుటేర్లు పారించిన నరహంతకులు మీరు. 1952లో ఏడుగురు యువకులను కాల్చి చంపి రక్తం కళ్ల చూసిన రాక్షసులు మీరు, 1969లో 369 మంది ముద్దుబిడ్డలపై తూటాలు కురిపించి రక్తం పారించిన ఖూనీకోర్లు మీరు, మలిదశ పోరాటంలో వేయి మందిని బలితీసుకున్న మృగాలు మీరు. కాంగ్రెస్ రక్కసి కోరలకు తెలంగాణ నెత్తుటి మరకలు అంటినాయి. నీకు మా రక్తం ఎంత కావాలంటే అంత పంపిస్తాం..కానీ, నువ్వు రైతులకు నీళ్లు ఇవ్వు. రైతుల కోసం ఎంత రక్తమైనా ధారపోయడానికి సిద్ధంగా వున్నం. నెత్తురు ఇస్తేనే.. నీళ్లు ఇస్తాం అని కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వం కోరుతుంటే మా నెత్తురు ధారపోస్తాం. మీ రక్త దాహం తీర్చుకోని.. ఎండుతున్న పొలాల జల దాహం తీర్చండి" అంటూ కేటీఆర్ తన ట్వీట్ లో సీఎం రేవంత్ రెడ్డిపై, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

## పౌల్ట్రీ రంగంలో మహిళల భాగస్వామ్యం పెరగాలి

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పశుసంవర్ధక, పౌల్ట్రీ రంగాల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యా సంస్థలు, పరిశ్రమల మధ్య సమన్వయం పెరగాలని కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. మహారాష్ట్ర యానిమల్ అండ్ ఫిషరీస్ సైన్సెస్ యూనివర్సిటీనాగ్‌పూర్, పౌల్ట్రీ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన రెండు రోజుల వెట్ కన్వర్జెన్స్-2026 వైస్ ఛాన్సలర్ల సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సదస్సులో దత్తాత్రేయ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నైపుణ్యాలతో పాటు పారిశ్రామిక దృక్పథాన్ని పెంపొందించాలని, పరిశోధన ఫలితాలు క్షేత్రస్థాయిలో రైతులకు అందేలా చూడాలని సూచించారు. ముఖ్యంగా పౌల్ట్రీ రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా సమ్మిళిత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వెటర్నరీ పరిశోధనలు, స్టార్టప్‌ల ప్రోత్సాహం, అగ్రిబిజినెస్ ఇంక్యుబేషన్, పశుసంవర్ధకంలో ఏఐ వినియోగం వంటి ఆరు అంశాలపై సదస్సులో మేధోమథనం జరిగింది. దేశవ్యాప్తంగా 30 మందికి పైగా వైస్ ఛాన్సలర్లు, శాస్త్రవేత్తలు, పౌల్ట్రీ ఇండియా ప్రతినిధులు ఉదయ్ సింగ్ బయాస్, ఎం. శ్రీకాంత్, పీవీఎన్ఆర్టీవీయూ వీసీ ప్రొఫెసర్ ఎం.జ్ఞాన ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. నవంబర్ 25-27 తేదీల్లో హైదరాబాద్ హైటెక్స్‌లో జరగనున్న 18వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో-2026 పోస్టర్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. నవంబర్ 24న పౌల్ట్రీ నాలెడ్జ్ డే నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## 12 బృందాలతో గాలింపు ముమ్మరం

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ కోసం పోలీసులు గాలింపును ముమ్మరం చేశారు. గాలింపు బృందాల సంఖ్యను 10 నుంచి 12కు పెంచారు. నిందితుడి కదలికలను గుర్తించేందుకు అతడు ఉపయోగించిన సిమ్ కార్డులతో పాటు బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్ల సీసీటీవీ ఫుటేజీలను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు పారిపోయి ఉండొచ్చనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటక, ఇతర ప్రాంతాలకు వెళ్లే హైవేలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. 44వ నంబర్ జాతీయ రహదారి వెంబడి ఉన్న హోటళ్లు, దాబాలు, లాడ్జీల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో తొలుత బాలిక తల్లి, నానమ్మలను రాజ్‌కుమార్ కత్తిపోట్లతో కడతేర్చాడు. తర్వాత నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బాలికను గొంతుకోసి చంపేశాడు. అనంతరం ఇంటికెళ్లి భార్య, నిద్రిస్తున్న కన్న బిడ్డల గొంతుకోసి కర్కశంగా హతమార్చాడు. మొత్తం అరగంట వ్యవధిలో మూడు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక, ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారుల్ని కిరాతకంగా అంతమొందించాడు. ఈ ఆరు హత్యలు గంటల్లోనే రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపాయి. పరారీలో ఉన్న నిందితుడిని పట్టిస్తే.. రూ.2 లక్షల నగదు బహుమతి ఇస్తామని ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీసులు ఇప్పటికే ప్రకటించారు. ఈ ఘటన అనంతరం పోలీసు ఉన్నతాధికారులు షాబాద్ ఎస్సై రమేశ్‌ను సస్పెండ్ చేశారు.

## రాజ్యాంగం కల్పించిన ఓటును ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలి

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో వేగవంతం చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఆందోల్ నియోజక వర్గంలోని మునిపల్లి, రాయికోడ్ మండలాల్లో మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతి ఒక్కరూ సిరియస్ గా తీసుకొని ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోలని సూచించారు.ప్రతి ఒక్క ఓటర్లకు మండల ప్రజాప్రతినిధులు సూచనాలు ఇవ్వాలని అన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి అలసత్వం ఉండకుండా బిఎల్ఎ లు బూతుల వారీగా రోజు వారి లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. ఓటర్లతో సమన్వయం చేసుకొని ఈ నెల 24 లోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.పూర్తి అయినా ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేసేందుకు బూత్ లేవల్ అధికారుల బిఎల్వోలకు అందజేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డాక్టర్స్ సెల్ చైర్మన్ డా..రాజీవ్,జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య,జగన్ మోహన్ రెడ్డి,సతీష్, సుధాకర్ రెడ్డి,రాంరెడ్డి, కేదార్నాథ్ పాటిల్,సిద్దన్న పాటిల్,బసరాజ్ పాటిల్,మహంకాళీ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలాజీ నర్సింలు, మండల ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ ,యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వింబుల్డన్ టైటిల్ మళ్లీ సినర్‌కే

**వింబుల్డన్ :** యానిక్ సినర్ (ఇటలీ) వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ ఛాంపియన్‌షిప్‌ను నిలబెట్టుకున్నాడు. గతేడాది తొలిసారి వింబుల్డన్ టైటిల్‌ను అందుకున్న 24 ఏళ్ల సినర్.. ఈ సారి కూడా విజేతగా నిలిచాడు. హోరాహోరీగా సాగిన పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో ఈ డిఫెండింగ్ ఛాంపియన్ 67(7), 76(2), 63, 64 తేడాతో ప్రపంచ నంబర్ వన్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)ను ఓడించాడు. ఈ పోరు మూడు గంటల 46 నిమిషాలపాటు సాగింది. సుదీర్ఘంగా సాగిన మొదటి సెట్‌లో జ్వెరెవ్ టై బ్రేకర్ ద్వారా గెలుపొందాడు. అయితే సినర్ పుంజుకుని రెండో సెట్‌ను కూడా టై బ్రేకర్ ద్వారా తన ఖాతాలో వేసుకున్నాడు.

## స్కాంల ప్రభుత్వం పోయి స్కీముల ప్రభుత్వం వచ్చుడు ఖాయం

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** స్కామ్‌ల ప్రభుత్వం పోయి, మళ్లీ స్కీంల ప్రభుత్వం రావడం ఖాయం అని, కేసీఆర్ ప్రభుత్వమే రావాలని ప్రజలు కోరుకుంటున్నారని రాష్ట్ర మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఆదివారం ఎస్ఐఆర్, బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు అంశాలపై.. పట్టణంలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హరీష్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం సమావేశంలో పార్టీ శ్రేణులను ఉద్దేశించి హరీష్‌రావు మాట్లాడారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగురవేసి యావత్తు తెలంగాణ మీ వైపు చూసేలా చేశారని కితాబునిచ్చారు. పటాన్‌చెరు గడ్డ బీఆర్ఎస్ అడ్డా అని ప్రశంసలు వర్షం కురిపించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ప్రారంభించిన సర్ ప్రక్రియపై పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో సర్ ప్రక్రియ కారణంగా ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగి ఎన్నికల ఫలితాలు మారాయని ఆరోపించారు. జీహెచ్ఎంసి ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే నాయకులు సర్‌ను సీరియస్‌గా తీసుకోవాలని, బీఎల్ఏలను చురుకుగా పనిచేయించాలని సూచించారు. రేవంత్‌రెడ్డి రూ.30 వేల కోట్ల విలువైన భూములను విక్రయించాడని ఆరోపించిన ఆయన, బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన అనేక సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని అన్నారు. వేలకోట్ల ప్రభుత్వ భూములను అమ్ముకుంటున్న రేవంత్ రెడ్డి సర్కార్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు ‘ఈట్ కా జవాబు పత్తర్ సే దేనా’ అంటూ కితాబిచ్చారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లాంటి సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించకుండా.. అందాల పోటీలు, బోధి భవన్ వంటి కార్యక్రమాలకు రూ. వందల కోట్ల ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. సిగాచి ప్రమాదంలో 54 మంది మృతి చెందినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు ఒక్క రూపాయి కూడా ఆర్థిక సాయం చేయలేదని, కంపెనీ యాజమాన్యమే పరిహారం చెల్లించిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో పటాన్ చెరు పట్టణంలో రూ.200 కోట్లతో నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించడం చేతకాని దద్దమ్మ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని విమర్శించారు. పటాన్‌చెరులో ఐటీ పార్క్ కోసం కేటాయించిన భూమిని ప్రభుత్వం అమ్ముకుందని ఆరోపించారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని స్థానాలను బీఆర్ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

రెండు లక్షల సభ్యత్వంతో కేసీఆర్‌కు గిఫ్ట్ అందిస్తాం : ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఎస్ఐఆర్ అంశంపై బూత్ లెవెల్ స్థాయి నుండి కార్యకర్తలను అప్రమత్తం చేయడంతో పాటు.. అవగాహన సదస్సులు నిర్వహిస్తూ.. ప్రతి ఓటును కాపాడుకుంటున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. త్వరలో జరగనున్న బీఆర్ఎస్ పార్టీ మెంబర్షిప్ అంశంలోనూ రెండు లక్షల సభ్యత్వం నమోదు చేసి కేసీఆర్‌కు బహుమతిగా అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ మాజీ చైర్మన్ బాలమల్లు, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# హైదరాబాద్ ప్రజలకు ట్యాంకర్లే దిక్కు!



**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్రంగా నీటి కరవు పీడిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని సాగు, తాగు నీటికే కాకుండా నగరాలు, పట్టణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి ప్రజలను కంటతడి పెట్టిస్తోంది. ఇటీవల హైదరాబాద్ మహానగరంలోని కూకట్‌పల్లికి చెందిన ఓ వ్యక్తి, నాలుగేళ్ల కిందట తన ఇంటి నిర్మాణ సమయంలో ఒక బోర్‌వెల్ వేయించారు. 1,000 అడుగుల లోతులో వేయగా, మొదట్లో సమృద్ధిగా నీరు లభించింది. అయితే, ఈ ఏడాది ఏప్రిల్ నాటికి అది ఎండిపోయింది. దాంతో, సమీపంలోనే ఆయన మరో బోర్‌వెల్‌ను 1,200 అడుగుల లోతు వరకు వేయించడానికి దాదాపు రూ.6 లక్షలు ఖర్చు చేశారు.అల్విన్ కాలనీకి చెందిన ఒక రిటైర్డ్ ఉద్యోగి ఇంటి నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో రెండు వేర్వేరు చోట్ల 1,000 అడుగుల లోతు వరకు బోర్లు వేసినా నీరు పడలేదు. దాదాపు రూ.10 లక్షలు నేల పాలయ్యాయి. ఇప్పుడు ఆయన మరో ప్రదేశంలో మరింత లోతుగా బోరు వేయడానికి ప్రయత్నిస్తున్నారు.

**పెరుగుతున్న నీటి బిల్లుల భారం..**

మహానగరంలో వేసవిలో తరచూ నీటి ఎద్దడి ఎదురవడం సహజమే. కానీ, ఈ సంవత్సరం కష్టాలు మరింత తీవ్రమయ్యాయి. ఎల్ నినో ప్రభావం కావచ్చు లేదా వర్షపాతం లోపం కావచ్చు. నగరం మాత్రం ప్రస్తుతం తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. నగరవాసులు ఇప్పుడు పూర్తిగా వాటర్ బోర్డు సరఫరా చేసే నీరు, ప్రైవేట్ ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు. దీనివల్ల నీటి బిల్లులు భారీగా పెరిగాయి. వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోయాయి.

**జల మండలి నుంచే 18 వేల ట్యాంకర్లు..**

మహానగరంలో 60 శాతం బోరు బావులు వట్టిపోయాయి. మహానగర పరిధిలోకి వచ్చే రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాలు మినహాయించి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల్లో భూగర్భ జలాలు దారుణ స్థితికి చేరుకున్నాయి. జులై మాసం మధ్యకి చేరుకున్నా కూడా జల మండలి నుంచి రోజుకు 18 వేల నీటి ట్యాంకర్లు బుక్ అవుతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇక ప్రైవేట్ ఈ సంఖ్యకు రెట్టింపు ట్యాంకర్లు సరఫరా చేస్తుండొచ్చని అంచనా.

**అడ్డగోలుగా బోర్‌వెల్స్ తవ్వకం!..**

కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో దాదాపు 30 లక్షల భవనాలు ఉంటాయని అంచనా. ప్రతి ఇంటి నిర్మాణ సమయంలో ఒక బోర్‌వెల్ వేస్తున్నారు. కొన్నాళ్లకు అది ఎండిపోతే మరొకటి వేస్తున్నారు. దీనివల్ల భూగర్భ జలమట్టాలు నామమాత్రంగా మిగిలాయి. అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్తుల భవనాలలో, సగటున 8.5 అంగుళాల వ్యాసం గల పెద్ద బోర్‌వెల్‌లను సుమారు 2 వేల అడుగుల లోతు వరకు తవ్వుతున్నారు.

**యజమానుల నుంచి ముడుపులు..**

నగరవ్యాప్తంగా భారీ బోర్‌వెల్ డ్రిల్లింగ్ యంత్రాలు అనుమతులు లేకుండానే యథేచ్ఛగా పనిచేస్తున్నాయి. బోరు బావులు తవ్వుకునేందుకు అనుమతులను స్వయంగా అధికారులే ఇవ్వలేదని చెబుతున్నప్పటికీ, స్కై టవర్స్‌ల్లో భారీ ఎత్తున బోర్లు వేస్తున్నారు. దీనికి తోడుగా బల్క్ కనెక్షన్‌ల కోసం జలమండలి నుంచి అనుమతులు పొందుతున్నారు. బోర్లు తవ్వుతున్న ఆయా యజమానుల నుంచి అధికారులు లంచాలు తీసుకుని, ఈ సమస్యను చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు.

**అస్తవ్యస్తమైన తాగునీటి సరఫరా..**

జలమండలి తాగునీటి సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కొన్ని ప్రాంతాలకు ఒక రోజు విడిచి ఒక రోజు నీరు అందుతుండగా, ఇతర కాలనీలకు రెండు రోజులకు ఒకసారి మాత్రమే సరఫరా అవుతోంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ప్రాంతాలలో, పెద్ద భవనాలకు ఎక్కువ సేపు నీరు అందుతుండగా, పక్కనే ఉన్న కాలనీలకు మూడు రోజులకు ఒకసారి మాత్రమే నీరు వస్తోంది. ఇటీవల, ఆయా ప్రాంతాల నివాసితులు నిరసన చేస్తూ, నీటి ట్యాంకర్లను అడ్డుకున్నారు. నగరంలో చాలా మంది ప్రజలు ప్రైవేట్ ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు. దీంతో ప్రైవేట్ వ్యాపారులు రూ.కోట్లు దండుకుంటున్నారు. జంట జలాశయాల పరీవాహక ప్రాంతాలలోని శిఖం భూముల్లో అక్రమంగా బోర్లు తవ్వి, విచక్షణారహితంగా నీటిని తోడుతున్నారు. నగరానికి నీటి సరఫరా కోసం వారు వ్యవసాయ బోర్లను కూడా లీజుకు తీసుకుంటున్నారు.

**రోజుకు 500 ఎమ్‌జీడీల భూగర్భ జలం..**

క్యూర్ పరిధిలోని మొత్తం 14.50 లక్షల నీటి కనెక్షన్‌లు ఉన్నయి. రోజువారీగా 550 మిలియన్ గ్యాలరీ పర్ డే (ఎమ్‌జీడీ) నీటిని సరఫరా చేస్తున్నారు. కానీ, రోజూ నగరానికి 1,876 మిలియన్ లీటర్లు అవసరమవుతోంది. ఇందులో సుమారు సుమారు 500 ఎమ్‌జీడీల భూగర్భ జలాలను తోడుతున్నారు. నగరంలో ప్రస్తుతం 30 లక్షలకు పైగా బోర్లు వినియోగంలో ఉన్నాయి. కేవలం జలమండలి నుంచే రోజూ 18,500 ట్యాంకర్ల సరఫరా చేస్తున్నారు.

స్నేహిత ఎక్స్‌ప్రెస్
13-07-2026
సోమవారం
హైదరాబాద్
expresstelugudaily.com






# జూబ్లీహిల్స్ లో 'ఫెస్టివోగ్' డిజైనర్ స్టోర్‌ను ప్రారంభించిన సినీ తారలు శ్రియ శరణ్, మంచు లక్ష్మి, నవదీప్



**హైదరాబాద్ , స్నేహిత ఎక్స్‌ప్రెస్:** జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 10 లో 'ఫెస్టివోగ్' భారతీయ లగ్జరీ చేనేత, కౌట్యూర్ ను సినీ తారలు శ్రియ శరణ్, మంచు లక్ష్మి, నవదీప్ కలిసి ప్రారంభించారు. అమెరికాలో దాదాపు పదేళ్లుగా భారతీయుల విశ్వాసాన్ని పొందిన ప్రీమియం లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్ ఫెస్టివోగ్. అమెరికా వెలుపల ప్రారంభమైన తొలి స్టోర్ ఇదే కావడం విశేషం. అరుదైన చేనేత వస్త్రాలు, పెళ్లి వేడుకల కోసం ప్రత్యేకంగా రూపొందించిన బ్రైడల్ కలెక్షన్లు, కౌట్యూర్ దుస్తులను హైదరాబాద్ ఫ్యాషన్ ప్రియులకు అందుబాటులోకి తెచ్చారు. అమెరికాలోని డల్లాస్‌లో ఫెస్టివోగ్ ఫ్లాగ్‌షిప్ స్టోర్ దేశంలోని అతి పెద్ద భారతీయ బ్రైడల్ బుటిక్‌లలో ఒకటిగా పేరొందింది. వివాహాలు, శుభకార్యాలు, ప్రత్యేక వేడుకల కోసం ప్రత్యేకమైన దుస్తులను కోరుకునే వినియోగదారులకు ఇది ప్రముఖ కేంద్రంగా నిలిచింది. ఇప్పుడు హైదరాబాద్ స్టోర్‌లో అరుదైన చేనేత చీరలు, బ్రైడల్ చీరలు, డిజైనర్ లెహంగాలు, కౌట్యూర్ కలెక్షన్లు, పురుషుల సంప్రదాయ దుస్తులు, కుర్తా సెట్లు, పిల్లల ప్రత్యేక దుస్తులు తదితర విభాగాల్లో ప్రత్యేక కలెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. సంస్థ వ్యవస్థాపకురాలు భావనా ధనేకుల, భాగస్వామి సింధు కొసరాజు మాట్లాడుతూ.., భారత్‌లో తొలి స్టోర్‌కు హైదరాబాద్‌ను ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సంప్రదాయాన్ని, ఆధునికతను సమన్వయం చేసుకున్న హైదరాబాద్ నగరంలో ప్రత్యేక చేనేత, నాణ్యమైన కళాత్మక దుస్తులకు విశేష ఆదరణ ఉందని, అందుకే తొలి భారతీయ స్టోర్‌ను ఇక్కడ ప్రారంభించినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని ఈ స్టోర్‌తో ఫెస్టివోగ్ భారతీయ లగ్జరీ ఫ్యాషన్ రంగంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని, ప్రత్యేకమైన వేడుకల కోసం అరుదైన, విలాసవంతమైన వస్త్రాలను కోరుకునే వారికి ఇది ప్రీమియం గమ్యస్థానంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.



# ఆర్టీఏలో కానిస్టేబుళ్లకు బదిలీలుండవా..?

- ఏళ్ల తరబడి తిష్టవేసి.. కానిస్టేబుళ్ల దందా!
- బదిలీ నిబంధనలు అధికారులకేనా.. కానిస్టేబుళ్లకు వర్తించవా?
- హనుమకొండ రవాణా శాఖలో నిబంధనలకు పాతర
- ఏళ్లుగా ఒకే చోట కొనసాగుతున్న ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుళ్లు
- ఆర్టీఏ కార్యాలయంలో పెత్తనం అంతా వారిదే
- అధికారులను సైతం శాసిస్తున్న వైనం
- బ్రోకర్ల వ్యవస్థకు మూలస్తంభాలుగా కానిస్టేబుళ్లు

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ప్రభుత్వ శాఖల్లో పారదర్శకతను పెంచేందుకు, అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం రూపొందించిన 'బదిలీల విధానం' హనుమకొండ ప్రాంతీయ రవాణా శాఖ (ఆర్టీఏ)లో నీరుగారుతోంది. అధికారులు కాలానుగుణంగా మారుతున్నా, కార్యాలయం వెనుక ఉండి వ్యవస్థను నడిపించే 'నిజమైన శక్తులు' మాత్రం ఏళ్ల తరబడి అదే చోట తిష్టవేసి ఉండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా కొందరు ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుళ్ల పెత్తనం అధికారుల కంటే మిన్నగా ఉండటం, బ్రోకర్ల వ్యవస్థకు వారు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

హనుమకొండ ఆర్టీఏ కార్యాలయంలో మొత్తం 13 మంది ఉన్నతాధికారులు (ఎంవీఐలు, ఏఎంవీఐలు) విధి నిర్వహణలో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కింది స్థాయి సిబ్బంది హవానే ఎక్కువగా కనిపిస్తోంది. కొత్తగా వచ్చిన ప్రతి అధికారి వద్ద, ఆ కార్యాలయంలో దీర్ఘకాలంగా ఉంటున్న కానిస్టేబులే 'కీ రోల్' పోషిస్తుండటం విశేషం. ఫైళ్ల కదలికలు మొదలు, వాహనాల తనిఖీలు, ఫీల్డ్ డ్యూటీల వరకు ఆ కానిస్టేబుల్ కనుసన్నల్లోనే నిర్ణయాలు జరుగుతాయని కార్యాలయ వర్గాల్లోనే చర్చ నడుస్తోంది. రెండేళ్ల లోపు బదిలీ కావాల్సిన అధికారులు మారుతున్నా, ఈ కానిస్టేబుళ్లు మాత్రం వేళ్లూనుకుని ఉండటం వెనుక ఉన్న అసలు రహస్యమేంటోనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**బ్రోకర్ల హవాకు 'కానిస్టేబుల్' అండ!**

ఆర్టీఏ కార్యాలయం వద్ద బ్రోకర్ల వ్యవస్థ రాజ్యమేలుతోందనే ఫిర్యాదులు దశాబ్దాలుగా ఉన్నా, వాటిని అడ్డుకోవడంలో వ్యవస్థ విఫలమవుతోంది. లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం వచ్చే సాధారణ ప్రజలను బ్రోకర్లు పీడిస్తుంటే, వారి వెనుక ఈ కానిస్టేబుళ్ల అండ ఉందని బాధితులు ఆరోపిస్తున్నారు. కార్యాలయం చుట్టూ తిరిగే బ్రోకర్ల నుంచి వచ్చే ప్రతి వ్యవహారం ఒక క్రమపద్ధతిలో పైస్థాయికి చేరుతోందన్న ప్రచారం ఆర్టీఏలో బహిరంగ రహస్యం. ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చినా, ఈ బ్రోకర్ల జోక్యం తగ్గకపోవడానికి కారణం కిందిస్థాయి సిబ్బందికి ఉండే 'వాటాలే'నని ప్రజలు మండిపడుతున్నారు.

**ఏసీబీ, విజిలెన్స్ రంగంలోకి దిగాల్సిన సమయం ఆసన్నమైందా?**

హనుమకొండ ఆర్టీఏలో జరుగుతున్న ఈ అక్రమ బదిలీల విధానంపై, బ్రోకర్ల కార్యకలాపాలపై ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకే చోట ఏళ్ల తరబడి పనిచేస్తున్న సిబ్బందిని వెంటనే బదిలీ చేయాలని, బ్రోకర్ల రహిత సేవలను అందుబాటులోకి తేవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై ప్రజలకు నమ్మకం పెరగాలంటే, పారదర్శకమైన బదిలీలు, సిబ్బంది జవాబుదారీతనం అత్యంత కీలకం. ఇప్పటికైనా విజిలెన్స్, ఏసీబీ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచి, ఆర్టీఏలో తిష్టవేసిన అవినీతి మూలాలను కత్తిరించాలని స్థానికులు వేడుకుంటున్నారు. ప్రభుత్వం అందిస్తున్న రవాణా సేవలు సామాన్యులకు సకాలంలో అందాలంటే, ఈ 'కానిస్టేబుళ్ల వ్యవస్థ'పై సమగ్ర విచారణ జరిపించడమే ఏకైక మార్గం.



# పవన్ కల్యాణ్‌కు సీఎం చంద్రబాబు పరామర్శ

- విజయవంతంగా పూర్తయిన సంక్లిష్ట శస్త్రచికిత్స
- వైద్యులతో సమావేశమై చంద్రబాబు. పవన్ ఆరోగ్యంపై ఆరా
- కొన్ని వారాల పాటు పూర్తి విశ్రాంతిలో డిప్యూటీ సీఎం

**ముంబై :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముంబై వెళ్లారు. ముంబైలోని కోకిలాబెన్ ధీరూబాయ్ అంబానీ ఆసుపత్రిలో పవన్ కల్యాణ్ కుడి భుజానికి శనివారం జరిగిన సంక్లిష్ట శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది. ప్రస్తుతం ఆయన ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్ ఆసుపత్రికి వెళ్లి పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. ఆపరేషన్ బెడ్ పక్కనే కూర్చుని చంద్రబాబు నాయుడు పవన్ కల్యాణ్‌తో ఆత్మీయంగా ముచ్చటించారు.

**గాయాల తీవ్రత దృష్ట్యా సర్జరీ తప్పనిసరి**

పవన్ కల్యాణ్‌కు సర్జరీ చేసిన ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ దిన్షా పార్థీవాలా నేతృత్వంలోని వైద్యుల బృందంతో ముఖ్యమంత్రి, మంత్రులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. దాదాపు మూడున్నర గంటల పాటు జరిగిన ఈ ఆపరేషన్ వివరాలను, తదుపరి వైద్య సంరక్షణ ప్రణాళికలను వైద్యులు ముఖ్యమంత్రికి వివరించారు. గతంలో సినిమా షూటింగ్‌లు, సుదీర్ఘ రాజకీయ ప్రచారాల సమయంలో జనాల మధ్య చేతులు లాగడం వల్ల సంభవించిన రొటేటర్ కఫ్ గాయాల తీవ్రత దృష్ట్యా ఈ శస్త్రచికిత్స తప్పనిసరి అయిందని వైద్యులు పేర్కొన్నారు.

**ప్రజాసేవలో పవన్ కల్యాణ్ త్వరగా తిరిగి రావాలని ఆకాంక్ష**

ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇరు పార్టీల అగ్రనేతల మధ్య ఉన్న బలమైన సమన్వయానికి, ఆత్మీయ బంధానికి ఈ ముంబై భేటీ మరో నిదర్శనంగా నిలిచింది. పవన్ కల్యాణ్ త్వరగా, పూర్తి ఆరోగ్యంతో కోలుకుని ప్రజాసేవలోకి తిరిగి రావాలని సీఎం చంద్రబాబు, మంత్రులు ఆకాంక్షించారు. శస్త్రచికిత్స అనంతరం పవన్ కల్యాణ్ ఆరోగ్యంగా, చిరునవ్వుతో ఉన్న ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో జనసైనికులు, కూటమి నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వైద్యుల సూచన మేరకు పవన్ కల్యాణ్ మరికొన్ని వారాల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోనున్నారు.

# రాజకీయ పర్యాటకులుగా గాంధీ కుటుంబం

**నేషనల్ డెస్క్ :** కేరళలోని వయనాడ్‌లో ఇటీవల జరిగిన కొండచరియల విరిగిపడిన ఘటన నేపథ్యంలో, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలపై భారతీయ జనతా పార్టీ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. బాధితులను పరామర్శించేందుకు వెళ్లకుండా, కేవలం సోషల్ మీడియాకే పరిమితం కావడం వారి 'రాజకీయ పర్యాటక' మనస్తత్వానికి నిదర్శనమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి తుహిన్ సిన్హా మండిపడ్డారు. జూలై 7న వయనాడ్ జిల్లా అనక్కంపోయిల్ మెప్పాడి ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై స్పందించిన తుహిన్ సిన్హా, "ప్రస్తుతం ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రియాంక గాంధీ వాద్రా, గతంలో ఎంపీగా ఉన్న రాహుల్ గాంధీ ఇద్దరూ బాధితులను పరామర్శించేందుకు వెళ్లకపోవడం సిగ్గుచేటు. మీకు రాజకీయ అవసరాలు మాత్రమే ముఖ్యం, ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు కనిపించరు. మీరు కేవలం పార్ట్ టైమ్ రాజకీయ నాయకులు మాత్రమే" అని తీవ్రస్థాయిలో విమర్శించారు. గాంధీ కుటుంబం వయనాడ్‌ను కేవలం తమ



రాజకీయ మనుగడ కోసం వాడుకుంటోందని ఆరోపించారు. 2024 జూలై నాటి భారీ విపత్తు సమయంలో కూడా రాహుల్ గాంధీ ఆలస్యంగా స్పందించారని ఆయన గుర్తు చేశారు.

**వయనాడ్‌ను వదిలేస్తారా?**

రాహుల్ గాంధీ 2019లో వయనాడ్ నుంచి గెలిచిన తర్వాత, తాజాగా రాయ్‌బరేలీకి మారగానే వయనాడ్‌ను వదిలేశారని సిన్హా పేర్కొన్నారు. అమేథీని దశాబ్దాల పాటు పట్టించుకోకపోవడం వల్లే అక్కడ ఓడిపోయి పారిపోవాల్సి వచ్చిందని, భవిష్యత్తులో ప్రియాంక గాంధీ కూడా ఢిల్లీకి దగ్గరగా మరో సురక్షిత స్థానం దొరికితే వయనాడ్‌ను వదిలేస్తారని జోస్యం చెప్పారు. ఎంపీగా ఉన్న సమయంలో పర్యావరణ పరిరక్షణ, విపత్తు నివారణ చర్యల విషయంలో గాంధీ కుటుంబం పూర్తిగా విఫలమైందని ఆయన దుయ్యబట్టారు.

మరోవైపు, ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనల ద్వారా దేశ ప్రతిష్ఠను అంతర్జాతీయ వేదికలపై ఇనుమడింపజేస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా కొనియాడారు. ఇండోనేసియా, న్యూజిలాండ్ వంటి దేశాల అధినేతలు మోదీ నాయకత్వాన్ని ప్రశంసిస్తున్నారని, దౌత్యపరంగా భారత్ గొప్ప విజయాలు సాధిస్తోందని ఆయన అన్నారు. ఈ క్రమంలోనే విదేశీ పర్యటనల్లో ఉన్న రాహుల్ గాంధీపై పాత్రా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "ప్రధాని మోదీ దేశానికి విజయాలను తీసుకొస్తుంటే, విదేశాల్లో ఉన్న రాహుల్ గాంధీ మూసివేసిన గదుల్లో కూర్చుని దేశానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారా?" అని ప్రశ్నించారు. జూలై 10న జరగాల్సిన రాహుల్ గాంధీ కార్యక్రమాలు వాయిదా పడటంపై స్పందిస్తూ, లండన్, ఐస్‌లాండ్, జర్మనీ దేశాల్లో ఆయన పర్యటనల తీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మోదీ విదేశీ పర్యటనల ఫలితాలను చూసి ప్రతిపక్షాలు గర్వించాలని, రాజకీయాల కోసం దేశ ప్రయోజనాలను పణంగా పెట్టవద్దని సంబిత్ పాత్రా హితవు పలికారు.



Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com